సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



దైవభక్తి కలిగి ఉండాలి 8లో

ఎం.మాకవరంలోని నాగలింగేశ్వర స్వామి ఆలయాన్ని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివ ప్రసాద్ దంపతులు ఆదివారం సందర్శించారు.



గంజాయి స్వాధీనం 8లో

ఒడిశా నుంచి అరకు మీదుగా రెండు కార్లలో తరలిస్తున్న 2002 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గుర్ని అరెస్టు చేశారు.



ఘనంగా అడవిరాజుల పండగ

జిల్లాలోని వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల్లో ఆదివారం అడవిరాజుల పండగను ఘనంగా నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

16 నుంచి ఉమానీలకంఠేశ్వరుని కల్యాణ మహోత్సవాలు



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు

పాడేరు రూరల్ : పట్టణంలోని శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలను ఈనెల 16,17,18 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఆలయ ప్రధాన అర్చకుడు రామం పంతులు తెలిపారు. ఈ ఉత్సవాల పోస్టర్లను ఆదివారం ఆలయ ప్రాంగణంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, కొట్టగుళ్లి రామారావు, బోనంగి వెంకటరమణ, వర్తన పిన్నయ్యదొర, పలాసి బాబురావు పాల్గొన్నారు.

వైభవంగా మానసాదేవి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం

అడ్డతీగల: స్థానిక పవన గిరి క్షేత్రంలో శ్రీ మానసాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ అయ్యప్ప శర్మ, గణేశ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సాయంతో రాజస్తాన్ జయపూర్‌లో అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయించారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన చేసి నీరాజన మంత్ర పుష్పాలతో విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. హోమం, అన్నప్రసాద వితరణ ఏర్పాటుచేశారు.

ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

జి.మాడుగుల: జిల్లా పోలీస్ శాఖ అధ్వర్యంలో ప్రేరణ ద్వారా గిరిజన యువతకు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఐ సత్యానారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు అన్నారు. గిరిజన యువకులు బీఎస్సీ (కెమిస్ట్రీ) డిప్లొమాలో (మెకానికల్, ఎలక్ట్రికల్)లో ఉత్తీర్ణతతోపాటు 18–23 సంవత్సరాలు మధ్య వయసు ఉండాలని వారు అన్నారు. విజయనగరం జిల్లా టీటీడీసీ మహిళా ప్రాంగణంలో రెడ్డీస్ లేబొరేటరీ ఇండియా లిమిటెడ్‌లో వంద రోజులు శిక్షణ అందిస్తారని ఉచిత భోజనం, వసతి కల్పిస్తారని వారు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన గిరిజన యువకులకు హైదరాబాద్, విశాఖపట్నంలో నెలకు రూ.15వేలు జీతం చెల్లిస్తారని వారు చెప్పారు. ఆసక్తి గత గిరిజన యువకులు 10వతరగతి ఉత్తీర్ణత, డిగ్రీ, డిప్లమో ధ్రువపత్రాలు, జెరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, రేషన్‌కార్డులతో స్థానిక పోలీసుస్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

శతాధిక వృద్ధుడికి సత్కారం

- ఘనంగా జన్మదిన వేడుకలు



అప్పారావును సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎటపాక: మండలంలోని వెంకటరెడ్డిపేట గ్రామానికి చెందిన అడ్డండి అప్పారావు వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆయనకు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాదిరెడ్డి కుటుంబానికి చెందిన వారు ఆయనకు కల్యాణం, తదితర పూజా కార్యక్రమాలు చేసి పాదాభిషేకం చేశారు. అనంతరం ఆయనకు శాలువాతో సత్కరించి, ఆయన జీవిత విశేషాలు కలిగిన జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా శతాధిక వృద్ధుడు అప్పారావు మాట్లాడుతూ జీవన శైలి, ఆహారపు అలవాట్ల కారణంగా తాను ఆనందంగా, ఆరోగ్యంగా ఉన్నానని చెప్పారు. కార్యక్రమంలో మాదిరెడ్డి కృష్ణమోహన్, గణేష్, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

లాభాల మిరియం

మిరియం రైతులకు ఈ ఏడాది దిగుబడి, మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. పాదులు గతేడాది కన్నా విరగ్గాశాయి. ఎకరాకు 400 కిలోల ఎండు మిరియాలు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. గతేడాది మార్కెట్ ధరల ప్రకారం ఎకరాకు రూ.1.5 లక్షలకు పైగా ఆదాయం గిరి రైతుకు వచ్చే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

- ఎకరాకు 800 కిలోల దిగుబడి
- శుద్ధి అనంతరం 400 కేజీల రాబడి
- గతేడాది కిలో రూ.500 ధరతో కొనుగోలు
- ఈ ఏడాది సుమారు రూ.1.5 లక్షలకు పైగా ఆదాయం
- గిరి రైతులకు వచ్చే అవకాశం



విరగ్గాసిన మిరియాలు (ఇన్‌సెట్)ఎండు మిరియాలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న మిరియాల పాదులు విరగ్గాయడంతో గిరి రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మిరియం గింజలు పక్వానికి రావడంతో సేకరణకు సిద్ధమవుతున్నారు.

జాతీయ మార్కెట్లో..

మన్యంలో సేంద్రియ పద్ధతిలో గిరిజన రైతులు సాగు చేసే మిరియాలకు జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. నాణ్యతలో ప్రథమస్థానంలో నిలుస్తున్నాయి. ఏజెన్సీ 11 మండలాల పరిధిలోని 2.21లక్షల ఎకరాల్లో గిరిజన రైతులు కేంద్ర కాఫీ బోర్డు, ఐటీడీఏ సహకారంతో సాగు చేస్తున్నారు. ఈ తోటల్లో 1,58,021 ఎకరాల్లో కాఫీ పంట ఫలసాయం ఇస్తోంది. సుమారు 50 వేల ఎకరాల కాఫీ తోటల్లో నీడగా ఉన్న సిల్వర్‌ఓక్ చెట్లకు మిరియం పాదులను పాకించి సాగు చేస్తున్నారు. కాఫీతో పాటు మిరియం పంట కూడా ఏటా రైతులకు మంచి ఆదాయం ఇస్తోంది. కాఫీ గింజల వ్యాపారం పూర్తయిన వెంటనే మిరియం దిగుబడులు ప్రారంభమవుతాయి.

ఎకరానికి 400 కిలోలు..

ఎకరా కాఫీతోటలో 100 సిల్వర్‌ఓక్ మొక్కలకు మిరియాల పాదులు ఉంటాయి. ఒకొక్క పాదుకు తక్కువలో చూసుకున్న 8 కిలోల చొప్పున 800 కిలోల పచ్చిమిరియాలు దిగుబడి వస్తుంది. వీటిని గిరిజనులు సేకరించి ఇంటి వద్ద వేడినీళ్లతో శుద్ధి చేసి ఆరబెడతారు. బాగా ఆరిన తరువాత 400 కిలోల ఎండు మిరియాలు వస్తాయని గిరి రైతులు తెలిపారు.

కిలో రూ.500తో గతేడాది అమ్మకాలు

గతేడాది మిరియాలకు మంచి ధర లభించింది. సీజన్ ప్రారంభం అంటే మార్చి మొదటి వారంలో కిలో రూ.350 ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు. సీజన్ చివరి ఏప్రిల్, మే నెలల్లో వ్యాపారులు కిలో రూ.500తో పోటాపోటీగా కొనుగోలు చేశారు.అలాగే జాతీయ మార్కెట్‌లో కూడా కిలో రూ.600 పలకడంతో మిరియాల ద్వారా వ్యాపారులు మంచి లాభాలు పొందారు.

గిట్టుబాటు ధరతో మార్కెటింగ్

ఏజెన్సీలో గిరిజన రైతులు కాఫీలో అంతరపంటగా సాగుచేస్తున్న మిరియాలకు నాణ్యతలో నంబర్‌వన్‌గా గుర్తింపు ఉంది. స్పైసెస్ బోర్డు ద్వారా గత రెండేళ్ల నుంచి మిరియాల పంటను మరింత ప్రోత్సహిస్తున్నాం. మిరియాల సాగుచేసే రైతులకు నిచ్చెనలు పంపిణీ చేశాం. గిట్టుబాటు ధరలు కూడా కల్పించే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నాం. స్పైసెస్ బోర్డు, మ్యాక్స్ సొసైటీ ద్వారా కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

– ఆర్.గోపాలకృష్ణ, ఐటీడీఏ పీవో, పాడేరు

ఎస్ఎస్‌సీ పరీక్షల్లో గిరి విద్యార్థుల సత్తా

- తొమ్మిది మంది ప్రతిభ



ఎస్ఎస్‌సీ పరీక్షల్లో సత్తా చాటిన గిరిజన విద్యార్థులు

సాక్షి,పాడేరు: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఎనిమిది మంది గిరిజన విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎస్ఎస్‌సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ టైర్‌వన్ ఫలితాలను శనివారం రాత్రి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రకటించింది. విశాఖపట్నం జిల్లా వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో ఐటీడీఏ ఆధ్వర్యంలోని శిక్షణ పొందుతున్న గిరిజన విద్యార్థులు స్టాఫ్ సెలక్షన్ పరీక్షలకు హాజరయ్యారు. టైర్‌వన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ టైర్‌వన్ పరీక్షలో తొమ్మిది మంది ప్రతిభ చూపారు. టైర్–2 పరీక్షలకు అర్హత సాధించారు. ప్రతిభ కనబరిచిన కె.పృథ్వీరాజ్, బి.శ్రీహరినాయుడు, ఎ.ఉమాసాయి, సీ.హెచ్.వెంకటచైతన్య, పి.జయరామ్, ఎస్.కమల్‌చంద్ర, కె.ప్రదీప్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, డి.నవ్యను ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ అభినందించారు. 21వసెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సంస్థ ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.ఇటీవల గ్రూప్ వన్ పరీక్షల్లోను 12 మంది గిరిజన అభ్యర్థులు ప్రతిభ చూపడం తెలిసిందే.ఈ సందర్భంగా శిక్షణ సంస్థ అధినేత ధరణి మాట్లాడుతూ వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో గిరిజన అభ్యర్థులకు సివిల్స్‌కు సంబంధించి నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

బాధిత కుటుంబాలకు రవిబాబు పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి



బాధిత కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు



బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందిస్తున్న చైర్మన్ రవిబాబు

పెదబయలు: ఆయిల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు పరామర్శించారు. ఆదివారం ఆయన పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం ,వంచేడిపుట్టు, బొండాపల్లి పంచాయతీ చంపాపుట్టు గ్రామాల్లో పర్యటించారు. బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. వారి పరిస్థితిని చూసి చలించి పోయారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎస్టీ కమిషన్ ద్వారా వారికి ఎలాంటి న్యాయం జరగాల్సి ఉన్నా కలెక్టర్‌తో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల భార్యలకు ప్రభుత్వం వితంతు పింఛను మంజూరు చేస్తుందని చెప్పారు. బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఐదు కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరకులను రవిబాబు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ ప్రాంతాల్లో జాతీయ ఉపాధి పథకంలో పని దినాలు కేంద్ర ప్రభుత్వం పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. తద్వారా వలసలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు. ఉపాధి పనిదినాలు తక్కువగా ఉన్నందున కొద్దిరోజులు మాత్రమే గ్రామాల్లో ఉపాధి లభిస్తోందన్నారు. తరువాత ఇతర ప్రాంతాలకు వలస బాట పడుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చన్నారు. ఈవిషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి కమిషన్ తీసుకువెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరింగి లిల్లీ, కొర్రా రామలక్ష్మి, ఎంపీపీ వరహాలమ్మ, సర్పంచ్ మత్స్యరాజు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి కొమ్ము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏ ప్రభుత్వం చేయనంతగా సాయం

పెదబయలు: ఆయిల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ఏ ప్రభుత్వం చేయనంతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారని వైఎస్సార్ సీపీ ఎస్టీసెల్ అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మీ అన్నారు. ఆదివారం ఆమె పర్రెడ, బొండాపల్లి పంచాయతీల పరిధిలోని లక్ష్మీపురం, వంచేడిపుట్టు, చంపాపుట్టు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు. సర్పంచ్‌లు మత్స్యరాజు, రవిశంకర్, చింతా కొండలరావు పాల్గొన్నారు.

గృహ సారథుల నియామకాలు పూర్తి

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ఎమ్మెల్యే పాల్గుణకు గృహ సారథుల నివేదికను అందజేస్తున్న సోషల్ మీడియా ప్రతినిధులు

సాక్షి,పాడేరు: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గృహసారథుల నియామకాలను విజయవంతంగా పూర్తిచేశామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. గృహసారథుల నియామకాల నివేదికను సోషల్ మీడియా ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యేకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 115 గ్రామ సచివాలయాల పరిధిలో 345 కన్వీనర్లు, 3,308 మంది గృహసారథులను నియమించామని ఆయన తెలిపారు. కన్వీనర్లు, గృహసారథుల నియామకాలకు సంబంధించి అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యమిచ్చామని ఆయన పేర్కొన్నారు. దీనిపై నివేదికను పార్టీ అధిష్టానానికి అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నియమకాలను విజయవంతం చేయడలంలో సోషల్ మీడియా అరకు మండల కన్వీనర్ మొస్యా కిరణ్‌కుమార్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్లు పట్టాసి సంపత్‌కుమార్, పంచాడి తిరుపతిఎంతో శ్రమించారన్నారు. వారిని ఆయన అభినందించారు.

మత్స్యగుండం ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత

- ఎస్పీ సతీష్‌కుమార్



ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

హుకుంపేట: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రమైన మత్స్యగుండంలో మహాశివరాత్రి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తమ కుటుంబ సభ్యులతో ఆలయాన్ని సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 17,18,19 తేదీల్లో జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భద్రత కల్పిస్తామన్నారు. ఉత్సవ కమిటీ పోలీసుశాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాడేరు సీఐ సుధాకర్, ఎస్ఐ సతీష్, సర్పంచ్ శాంతకుమారి, ఉత్సవకమిటీ ప్రతినిధులు సింహాచలం నాయుడు, గోపాలపాత్రుడు, రాంబాబు, మత్స్యకొండబాబు, బాలయ్య, ఈశ్వర్, హరినాథ్ పాల్గొన్నారు.

అరకు రైల్వేస్టేషన్‌కు
ఆధునిక సొబగులు



- అమృత్ భారత్ స్టేషన్ పథకంలో చోటు
- మారనున్న రైల్వేస్టేషన్ రూపురేఖలు
- 53 రకాల ప్రాథమిక సౌకర్యాలు,
- వసతుల కల్పనకు మాస్టర్‌ప్లాన్

విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ప్రధాన రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారనున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో అరకు, అనకాపల్లి, యలమంచిలి స్టేషన్లకు చోటు దక్కింది. తాజాగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా ఎంపిక చేసిన స్టేషన్లలో 53 రకాలైన ప్రాథమిక, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. ఆ స్టేషన్ల భౌగోళిక పరిస్థితిని బట్టి మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నారు. తర్వాత ఏఏ రకాల వసతులు అవసరమో గుర్తించి ఒక్కొక్కటిగా కల్పించనున్నారు.

పథకం ఉద్దేశమిదీ..

- ఎంపికైన స్టేషన్‌లో ఆధునిక రీతిలో భవనాలు, పార్కింగ్ షెడ్ల నిర్మాణం
- ప్రస్తుతం ప్లాట్‌ఫాంలో ఉన్న పొడవు(600)ను 760 నుంచి 840 మీటర్ల వరకు పెంచడం
- స్టేషన్ ఆవరణలో పరిశుభ్రత కోసం సులభమైన నిర్వాహణ కోసం బ్యాలస్ట్‌లెస్ ట్రాక్ ఏర్పాటు
- ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎన్ఎస్‌జీ 1–4, ఎస్‌జీ 1–2 కేటగిరీలుగా విభజించి ఎస్కలేటర్లు ఏర్పాటు
- దివ్యాంగుల సౌకర్యం కోసం ప్రత్యేక వీల్‌చైర్ల మార్గాల నిర్మాణం
- వసతి గృహాలు, వాటికి అనుబంధంగా కేఫటేరియా ఏర్పాటు
- స్థానిక ఉత్పత్తుల విక్రయాలకు స్టాళ్ల ఏర్పాటు
- స్టేషన్ మొదటి అంతస్తులో ప్రత్యేకంగా రూఫ్ ప్లాజా
- ప్రత్యేక సమావేశ మందిరాలు
- స్టేషన్‌కు రెండువైపులా అప్రోచ్ రోడ్లు, పాదచారులకు ప్రత్యేక దారి
- ల్యాండ్ స్కేపింగ్, అధునాతన విద్యుద్దీపాల వెలుగులు
- వేగవంతమైన వైఫై కోసం 5జీ టవర్ల ఏర్పాటు

వీటితోపాటు మరిన్ని మెరుగైన సేవలు అందుబాటులో తెచ్చేందుకు ఈ పథకం అమల్లోకి తీసుకొస్తున్నారు. అరకు, అనకాపల్లి, యలమంచిలి స్టేషన్లలో రోజురోజుకూ ప్రయాణికుల రద్దీ పెరుగుతోంది. సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్నాయని ప్రజా సంఘాలు, ప్రయాణికులు గగ్గోలు పెడుతూ.. నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో అమృత్ భారత్ స్టేషన్ పథకానికి ఎంపిక చేయడంతో స్థానికుల్లో ఆశలు చిగురించాయి.

మహా శివరాత్రికి విశేష ఏర్పాట్లు



నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం

విశాఖపట్నం : మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శివాలయాల్లో విశేష ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 18న శని త్రయోదశి కూడా రావడంతో పరమేశ్వరుడికి, నవ గ్రహాలకు పూజలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఆ రోజు పూర్ణామార్కెట్‌లోని శ్రీ దుర్గాలమ్మ ఆలయం, అప్పికొండ శివాలయానికి వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వీటితో పాటు మరో 15 శివాలయాలకు భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని పలు ఆలయాలకు డిప్యూటేషన్‌పై సిబ్బందిని నియమిస్తున్నారు.

తీరంలో మరింత భద్రత

అందుబాటులోకి 10 బైక్‌లు, రెండు బీచ్ పెట్రోలింగ్ ట్రాక్టర్లు



బీచ్‌లో టూరిస్ట్ పోలీస్‌స్టేషన్

బీచ్‌రోడ్డు (విశాఖ): సాగరతీరంలో పర్యటనకు వచ్చే సందర్శకులకు నగర పోలీసులు మరింత భద్రతనిచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే బీచ్ రోడ్డులో దిశ టీంలు నిరంతరం పహారా కాస్తున్నాయి. బీచ్ అవుట్ పోస్టులు ఉన్నాయి. వాటికి అదనంగా టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీంతో పాటు నిరంతరం తీరంలో గస్తీ కాసేందుకు 10 ద్విచక్ర వాహనాలు, ఇసుకలో పెట్రోలింగ్ చేసేందుకు రెండు మినీ ట్రాక్టర్లను సిద్ధం చేశారు. ఈ మేరకు ఆదివారం బీచ్‌లో విజయవంతంగా ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వర్చువల్‌గా వీటిని ప్రారంభించనున్నారు.

ఆపరేషన్ స్వేచ్ఛతో బాలలకు విముక్తి

అల్లిపురం (విశాఖ దక్షిణం): 'వెట్టి చాకిరీ పని విధానం, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని పరిరక్షిద్దాం' అనే నినాదంతో 'ఆపరేషన్ స్వేచ్ఛ' స్పెషల్ డ్రైవ్ ఈనెల 15 వరకు జరుగుతుందని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా 20 మంది బాలబాలికలను కాపాడినట్లు పేర్కొన్నారు. ఇందులో 18 మంది బాలురు, ఇద్దరు బాలికలు ఉన్నారన్నారు.

వీరిలో 12 మందిని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించినట్లు తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఎనిమిది మందిని అప్పగించామన్నారు.

మన్యంలో మళ్లీ చలిగాలులు





రాజవొమ్మంగిలో దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమైన గిరిజనం



పాడేరులో కురుస్తున్న మంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పొగమంచుతో పాటు చలిగాలులు మళ్లీ వీస్తున్నాయి.ఆదివారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం కన్నా ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆదివారం 11.5 డిగ్రీలు నమోదైంది.అరకులోయలో 13.4డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 14 డిగ్రీలు నమోదైనట్టు అధికారులు తెలిపారు. పాడేరులో ఉదయం పొగమంచు కురిసినప్పటికీ ఎనిమిది గంటలకే సూర్యోదయం అయ్యింది. చింతపల్లి, అరకులోయలో మాత్రం ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు కురిసింది. రాత్రివేళల్లో చలితీవ్రత నెలకొంది.

రాజవొమ్మంగి: మండల కేంద్రమైన రాజవొమ్మంగి ఉదయం 8 గంటల దాటినా మంచు తెరలు వీడలేదు. వేసవి సమీపిస్తున్నా మంచు ప్రభావం తగ్గలేదు. కష్టజీవులు మాత్రం ఇవేవీ లెక్కచేయక తమ దైనందిన కార్యమాల్లో నిమగ్నమయారు.

క్లుప్తంగా

దైవభక్తి కలిగి ఉండాలి



ఎంపీ దంపతులను సన్మానించి కానుకలందిస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: మండలంలోని ఎం.మాకవరంలోని నాగలింగేశ్వర స్వామి ఆలయాన్ని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు ఆదివారం సందర్శించారు. కమిటీ సభ్యులు ఎంపీ దంపతులను ఆలయ సంప్రదాయ పద్ధతులతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేయించారు. ఎంపీ మాధవి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని కోరారు. దైవభక్తితో మనశ్శాంతి కలుగుతుందన్నారు. సర్పంచ్ కె.చిన్నమ్మి ఎంపీటీసీ సభ్యురాలు రత్నం, స్థానిక పెద్దలున్నారు.

ఏఎస్ఐ మృతికి సంతాపం



లింగమూర్తి (ఫైల్)

చింతపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జె.లింగమూర్తి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఆయన కొంత కాలంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఏడు నెలల క్రితం సీఆర్‌పీఎఫ్ 234 ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. లింగమూర్తిని సహచర సిబ్బంది, భోజనం చేసేందుకు రమ్మని పిలవగా అప్పటికే ఆయన స్పృహతప్పి పడిపోయినట్టు గుర్తించిన సిబ్బంది నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

కత్తితో దాడి చేసిన హతమార్చిన వ్యక్తిపై కేసు

పెదబయలు: గోమంగి పంచాయతీ కుమ్మరి వీధి గ్రామానికి చెందిన కొంతేరి సొన్నన్న(55)ను కత్తితో దాడి చేసి హతమార్చిన కుమ్మరి గణపతిపై హత్యకేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. సొన్నన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని ఆయన తెలిపారు.

కష్టపడితే అనుకున్నది సాధ్యం



సీనియర్స్ రన్నరప్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల



జూనియర్స్ విజేత సాయిగణపతి పాలిటెక్నిక్



జూనియర్స్ రన్నరప్ శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల

- విశాఖ కలెక్టర్ మల్లికార్జున
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంవీజీఆర్, ఎస్జీపీ జట్ల అర్హత
- ముగిసిన 'సాక్షి'ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ పోటీలు

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

విశాఖ స్పోర్ట్స్: బాధ్యతగా కష్టపడితే అనుకున్నది సాధించవచ్చని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. 'సాక్షి'ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ పోటీల ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. పని మీద చిత్తశుద్ధితో దృష్టి సారిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. క్రికెటర్ భరత్ జిల్లా స్థాయి నుంచి నేడు భారత జట్టుకు ఆడే స్థాయికి ఎదిగాడని ఉదహరించారు. కాగా.. 'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలకు సీనియర్స్ విభాగం నుంచి ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం)జట్టు, జూనియర్స్ విభాగం నుంచి సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టు అర్హత సాధించాయి. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఆదివారం జరిగిన ప్రాంతీయ స్థాయి పోటీల ఫైనల్‌లో ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టుపై తొమ్మిది వికెట్ల తేడాతో ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం) జట్టు, సాయిగణపతి పాలిటెక్నిక్(గిడిజాల) జట్టు 16 పరుగుల తేడాతో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల(పెద్దాపురం) జట్టుపై విజయం సాధించాయి.

'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, విశాఖ ఉమ్మడి జిల్లాల విజేతలుగా నిలిచిన సీనియర్స్, జూనియర్స్ జట్లు పోటీపడ్డాయి. ముగింపు కార్యక్రమంలో 'సాక్షి' బ్యూరో చీఫ్ కె.జి. రాఘవేంద్రరెడ్డి, యాడ్స్ డీజీఎం శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు, 'సాక్షి'టీవీ సీనియర్ కరస్పాండెంట్ రామచంద్రరావు పాల్గొన్నారు. ప్రాంతీయ పోటీల్లో విజేతలకు కలెక్టర్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు బహూకరించారు.

బౌలర్లు బెంబేలెత్తించారు : సీనియర్స్ విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ ఓడిన ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 10 ఓవర్లకు మరో రెండు బంతులుండగానే 59 పరుగులకు ఆలౌటైంది. జయంత్ మూడు, కల్యాణ్ రెండు, సురేష్ ఒక వికెట్ తీసి బ్యాటర్లను బెంబేలెత్తించారు. ప్రతిగా ఎంవీజీఆర్ కళాశాల జట్టు(విజయనగరం) ఒకే వికెట్ కోల్పోయి 7.1 ఓవర్లలోనే విజయలక్ష్యాన్నందుకుంది. కిరీటీ 24 పరుగులు చేశాడు. యశ్వంత్ ఒక వికెట్ తీయగలిగాడు.



కలెక్టర్ నుంచి ట్రోఫీ స్వీకరిస్తున్న సీనియర్స్ విజేత ఎంవీజీఆర్ కళాశాల

కష్టపడ్డారు

జూనియర్స్ విభాగంలో టాస్ గెలిచిన శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల జట్టు లక్ష్య ఛేదనకే మొగ్గు చూపింది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టు 10 ఓవర్లకు ఎనిమిది వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. నూకేష్ 29, కుమార్ 22 పరుగులు చేశారు. యశస్వి, చారి రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా శ్రీ ప్రకాష్ జట్టు మూడే వికెట్లు కోల్పోయినా.. 68 పరుగులే చేసింది. చరణ్ సాయి 35 పరుగులతో రాణించాడు.

ఘనంగా అడవిరాజుల పండగ



రాజవొమ్మంగి సమీప పాలాల్లో పూజలు చేస్తున్న గ్రామస్తులు

వై.రామవరం/రాజవొమ్మంగి: జిల్లాలోని వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల్లో ఆదివారం అడవిరాజుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఇది గిరిజన సంప్రదాయ పండుగల్లో ఒకటి. సీతారాములకు పుట్టిన లవకుశలను రాజులుబాబులుగా భావిస్తూ పండుగ జరుపుతారు. అడవిని పాలించే దేవతామూర్తులు అడవిరాజులు అని గిరిజనుల నమ్మకం. ఏజెన్సీ ప్రాంతంలో ప్రతీ ఏటా మహాశివరాత్రికి నెలరోజుల ముందు నుంచి ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. ప్రతీ ఆది, మంగళ, శుక్రవారాలో వేడకను జరుపుకుంటారు. వ్యవసాయం చేసే ప్రతీ కుటుంబం వారు ఈ నెల రోజుల్లో అవకాశం కొలది ఒక్కరు ఒక్కొక్క వారం చేస్తారు.రైతులు తమ పొలాల్లోని ఓ చెట్టును ఎంచుకొని, శుభ్ర పరచి, ముగ్గులు పెట్టి రాజులబాబులను ప్రతిష్టించి, ప్రత్యేక పూజలు చేస్తారు. మొక్కులు చెల్లించుకుంటారు. ఆ ప్రాంతంలోనే వివిధ రకాల పిండి అడవి దేవతలకు నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం ఇరుగు పొరుగు, బంధువులను, స్నేహితులను పండుగకు పిలిచి పొలంలోనే సహపంక్తి భోజనాలు చేస్తారు. అడవిరాజుల పండగ జరపడంతో కుటుంబాలతో పాటు గ్రామస్తులు ఆరోగ్యంగా ఉంటారని, పంటలు పండుతాయని గ్రామస్తుల నమ్మకం. కార్తీక వన సమారాధనగా ఈ కార్యక్రమం జరుగుతుంది. వై.రామవరం మండలంలోని జరిగిన వేడుకలో సర్పంచ్ పల్లాల బాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు. వై.రామవరం మండలం యార్లగడ్డ గ్రామం, రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేటలో పండగను ఘనంగా నిర్వహించారు.

గంజాయి స్వాధీనం

- 2002 కిలోల పట్టివేత
- ముగ్గురి అరెస్టు

అరకులోయ రూరల్: ఒడిశా రాష్ట్రం నుంచి అరకులోయ మీదుగా రెండు కార్లలో తరలిస్తున్న 2002 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ సంతోష్ తెలిపారు. ముందస్తు సమాచారంతో స్థానిక ఎన్టీఆర్ మైదానంలో చెక్ పోస్టు వద్ద ఆదివారం మాటువేసి గంజాయిని పట్టుకున్నట్టు చెప్పారు. దీని విలువ రూ.4.04 లక్షలు ఉంటుందని చెప్పారు. పట్టుబడిన వారిలో రాహుల్‌సింగ్, నరేంద్ర, అనంత్రో ఉన్నారని తెలిపారు. వీరిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్‌సింగ్ ఓ ప్రైవేట్ ఏజెన్సీలో బౌన్సర్‌గా, నరేంద్ర ఆర్‌పీఎఫ్ పోలీసుగా పనిచేస్తున్నట్టు చెప్పారు. ఒడిశా రాష్ట్రం పాడువ ప్రాంతం కంత్వ గ్రామానికి చెందిన అనంత్రో ఏ పనీ చేయడం లేదని తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారయ్యారని, కేసు నమోదు చేసి, వారి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ప్రేక్షకులను మెప్పించే పాత్రలో నటిస్తా

మోదకొండమ్మ అమ్మవారి పాత్రలో నటిస్తున్న కన్నడ హీరోయిన్ ప్రేమ



హీరోయిన్ ప్రేమ

మాడుగుల రూరల్: ప్రేక్షకుల మదిలో ఎప్పటికి గుర్తుండిపోయే పాత్రలకే అధిక ప్రాధాన్యమిస్తున్నామని, దర్శక, నిర్మాతలు చెప్పిన కథ తమ పాత్రకు నచ్చే విధంగా ఉంటే కాల్ సీట్స్ ఇస్తానని కన్నడ హీరోయిన్ ప్రేమ అన్నారు. ఆదివారం ఆమె మాడుగులలో జై మోదకొండమ్మ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు వందకు పైగా తెలుగు, తమిళ, కన్నడ, వంటి చిత్రాల్లో నటించాను. 1995లో తన మాతృభాష కన్నడ చిత్రం సవ్యసాచి సినిమా ద్వారా వెండి తెరకు పరిచయమయ్యాను. ప్రస్తుతం కన్నడ సినిమాలో లాయర్ పాత్ర పోషిస్తున్నాను. తెలుగు భాషలో ధర్మచక్రం, కోరుకున్న ప్రియుడు, జగదేకవీరుడు, మా ఆవిడ కలెక్టర్, దేవి, వంటి సినిమాలు తనకెంతో గుర్తింపును తెచ్చాయి. తాను ఎక్కువగా అమ్మవారి పాత్రలే పోషిస్తున్నాను. జై మోదకొండమ్మ అమ్మవారి చరిత్ర తెలుసుకుని తానెంతో పరవశించిపోయాను. ఈ ప్రాంతం ఎంతగానో ఆకట్టుకుంది.



చిన్నారుల నోట్లో పసర వేస్తున్న అమ్మవారి పాత్రలో హీరోయిన్ ప్రేమ

గతంలో కంటే ప్రస్తుతం సినిమాల్లో హీరోయిన్లకు ఎక్కువ ప్రాధాన్యత కలిగిన పాత్రలు కల్పించాలి. అప్పుడే తమ పాత్రలో రాణించగలుగుతారు అని ప్రేమ అన్నారు.

మాడుగులలో జై మోదకొండమ్మ చిత్రీకరణ...

మాడుగుల ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, టేకు తోటలో పోలాకి శివ దర్శకత్వంలో జై మోదకొండమ్మ సినిమా చివరి షెడ్యూల్ సన్నివేశాలు నాలుగు రోజులుగా చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రీకరణలో భాగంగా ఆదివారం మోదకొండమ్మ అమ్మవారి పాత్రలో హీరోయిన్ ప్రేమతోపాటు భక్తులపై పలు సన్నివేశాలు తీశారు. నిర్మాతలుగా హిమాలయ క్వాలిటీ స్వీట్స్ అధినేత యర్రంశెట్టి కిశోర్, జంధ్యాల గంగాధర్‌శర్మ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా శివాజీరాజు, కెమెరామెన్‌గా పార్థ వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో శివకృష్ణ, సత్యప్రకాశ్, బహుబలి ప్రభాకర్, జబర్దస్త్ గణపతితోపాటు పలువురు నటులు నటిస్తున్నారు. మే నెలలో ఈ చిత్రం విడుదల కానుందని నిర్మాత యర్రంశెట్టి కిశోర్ తెలిపారు.

క్షతగాత్రులకు కొనసాగుతున్న చికిత్స

- ఆస్పత్రి నుంచి కాంట్రాక్ట్ కార్మికుని డిశ్చార్జ్
- విభాగంలో ఉత్పత్తి పునరుద్ధరణ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-2 విభాగ ప్రమాద క్షతగాత్రులకు నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. గాయపడిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు తెలిసింది. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్‌లో శనివారం మధ్యాహ్నం జరిగిన పేలుడు సంఘటనలో పది మంది గాయపడిన విషయం తెలిసిందే. వారిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. గాయపడిన పది మందిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పినప్పటికీ వారు కూడా కోలుకుంటున్నారని సమాచారం. ఇదిలా ఉండగా సంఘటన స్థలాన్ని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారని విభాగం ఉద్యోగులు తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుపై అధికారులతో చర్చించారు. ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు అప్పలరాజును ఆస్పత్రి నుంచి ఆదివారం డిశ్చార్జ్ అయ్యాడు. కాగా విభాగంలో ఉత్పత్తిని ఆదివారం యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు.

జాతర్ల బస్సుల కండిషన్ మెరుగుపరచాలి

అనకాపల్లి జిల్లా డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ అప్పలనాయుడు

నర్సీపట్నం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జాతర్లకు తిప్పే ప్రత్యేక బస్సుల కండిషన్ మెరుగుపరచాలని ఆర్టీసీ జిల్లా డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు గ్యారేజీ సిబ్బందికి సూచించారు. ఆదివారం ఆయన స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించారు. గ్యారేజ్‌లోని బస్సుల కండిషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్యారేజీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కల్యాణపులోవ, ధారమట్టం జాతర్లకు డిపో నుంచి 50 ప్రత్యేక బస్సులు తిప్పటం శుభ పరిణామం అన్నారు. బస్సులు మార్గం మధ్యలో మరమ్మతులకు గురైతే ప్రయాణికులు ఇబ్బందులు పడతారన్నారు. బస్సులు ఎక్కడా ఆగిపోకుండా భక్తులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. స్పేర్ పార్ట్స్ ముందుగా సిద్ధం చేసుకోవాలని డిపో మేనేజర్ ఎంఎస్ఎస్.ధీరజ్‌కు సూచించారు.

అదుపుతప్పి కారు బోల్తా

- యువకుడి దుర్మరణం



బోల్తాపడిన కారు

ఎటపాక: మండలంలోని గౌరీపేట వద్ద కూనవరం ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో కారు బోల్తా పడిన ఘటనలో యువకుడు దుర్మరణం చెందాడు. కూనవరం మండలం భీమవరం గ్రామానికి చెందిన కిలారి నాగమల్లేష్ (26) తెలంగాణ రాష్ట్రంలోని బూర్గంపాడు మండలం ఏలేరు గ్రామంలో బంధువుల వద్ద ఉంటున్నాడు. భద్రాచలం నుంచి భీమవరం కారులో వస్తుండగా గౌరీదేవిపేట వద్ద రహదారి మలుపులో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవ్ వస్తున్న నాగమల్లేష్ కారు కింద పడడంతో తల నుజ్జునుజ్జయింది. ఘటన ప్రాంతానికి 108 వాహనం చేరుకుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'చీకటి పువ్వు' పుస్తకావిష్కరణ

సీతంపేట (విశాఖ ఉత్తర): మహిళా చేతన కార్యకర్త కత్తి పద్మ రచించిన కథల సంపుటి 'చీకటి పువ్వు' పుస్తకాన్ని ప్రముఖ సాహితీ విమర్శకుడు వివిన మూర్తి ఆదివారం పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. సాహితీ విమర్శకుడు జి.ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ కత్తి పద్మ నాలుగు దశాబ్దాలుగా ప్రజా జీవనంలో ఉన్నారని, అందుచేతనే ఆమె కథల విస్తృతి చాలా విశాలమైనదని అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న పద్మ.. బాధితుల జీవితాలను దర్శించే పద్ధతి విలక్షణమైనది కనుకనే ఆ వైవిధ్యం కథల్లో ప్రతిబింబించాయన్నారు. కథలు చదువుతుంటే ఆ పాత్రలపై సహానుభూతి పాఠకుల్లో కలుగుతుందన్నారు. రచయిత్రి, న్యాయవాది జహారా మాట్లాడుతూ సాహిత్యం బాధితుల బాధ, దుఃఖాలను ప్రతిబింబించకపోతే పాఠకులను హత్తుకోదన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు వి.సంధ్య మాట్లాడుతూ పద్మ కథల్లో పాత్రలు సజీవమైనవని పేర్కొన్నారు. చీకటి పువ్వు కథల ఆడియోను కథా రచయిత బమ్మిడి జగదీశ్వరరావు ఆవిష్కరించారు. రచయిత కత్తి పద్మ మాట్లాడుతూ తన కథలు ఉత్తరాంధ్ర మహిళల బాధలను ప్రతిబింబిస్తాయన్నారు. తన కథల్లోని పాత్రలు విషాధాల వలయాల్లో చిక్కుకుని కూడా తమ జీవితాలను నిలబెట్టుకోవడానికి, పరిష్కారాలు సాధించుకోవడానికి ప్రయత్నిస్తాయని తెలిపారు. చీకటి పువ్వు కథా సంకలనాన్ని మిత్ర సాహితి ప్రచురించింది. కార్యక్రమానికి మిత్ర సాహితి సభ్యుడు విశాఖ వర్మ అధ్యక్షత వహించారు.

కలకాలం నిలిచేలా కథలు రావాలి



మాట్లాడుతున్న సాహితీవేత్త వాసిరెడ్డి నవీన్

సీతంపేట: రాయాలన్న తపన, తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉండాలే గాని ప్రతి జీవితంలో అంతులేని కథలు ఎన్నో ఉంటాయని ప్రముఖ రచయిత, కథా సాహితి సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ అన్నారు. కా.రా. కథా నిలయం 26వ వార్షికోత్సవ సభ ఆదివారం మధ్యాహ్నం విశాఖ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన కథా సాహితి ప్రయాణం, కథ పరిణామం అనే అంశంపై ప్రసంగించారు. యువ రచయితలు కేవలం వాళ్ల మానసిక సంఘర్షణలపైనే కథలు రాయడంపై దృష్టి పెడుతున్నారని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సంబంధించిన అంశాలపై ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. రచయిత అంతర్లీనంగా సమాజాన్ని చూడకపోతే రాసే కథలు ఎక్కువకాలం నిలవలేవని గుర్తించాలన్నారు. కాళీపట్నం రామారావు 60 ఏళ్ల క్రితం రాసిన యజ్ఞం కథ గురించి ఇంకా మాట్లాడుకుంటున్నామంటే దాని గొప్పతనం గురించి ఆలోచించాలన్నారు. ఉత్తమ కథలను క్రమం తప్పకుండా 32 ఏళ్లుగా ప్రచురిస్తూ చరిత్ర సృష్టిస్తున్నామన్నారు. బాలసాహిత్యంపై ప్రముఖ రచయిత బమ్మిడి జగదీశ్వరరావు ప్రసంగించారు. బాలలకు పౌష్టికాహారం ఎంత అవసరమో సాహిత్యం కూడా అంత అవసరంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భావించాలన్నారు. పిల్లల ఊహా ప్రపంచాన్ని చిదిమేసే పనిని చదువు పేరుతో జరగడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ బాలల సినిమాలను పరిచయం చేస్తూ కథా రచయిత శివలక్ష్మి రచించిన 'చిగురంత ఆశ', ఉత్తమ అంతర్జాతీయ సినిమాలపై సమీక్షా సంపుటి 'రియలిస్టిక్ సినిమా'లను రచయిత జయసూర్య ఆవిష్కరించారు. కథా నిలయం కార్యదర్శి దాసరి రామచంద్రరావు మాట్లాడుతూ శ్రీకాకుళంలో ప్రముఖ రచయిత కాళీపట్నం రామారావు సారధ్యంలో స్థాపించిన కథా నిలయంలో 97వేల కథల పుస్తకాలు లభ్యమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కథా నిలయం కోశాధికారి కాళీపట్నం సుబ్బారావు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల రారాజు సీఎం జగన్



యలమంచిలిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టైలర్లు

టైలర్ల సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం

యలమంచిలి: సంక్షేమ పథకాలు రారాజు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఉత్తరాంధ్ర టైలర్స్ ఐక్య వేదిక వ్యవస్థాపకుడు అతికిని శెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం యలమంచిలి పట్టణంలో మండల టైలర్స్ కో ఆపరేటివ్ సొసైటీ సమావేశం జరిగింది. మండల టైలర్స్ సంఘం అధ్యక్షుడు వియ్యపు సత్తిబాబు ఆధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టైలర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై, సంఘం విధి విధానాలపై చర్చించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞత తెలుపుతూ ఆయన చిత్రపటానికి టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర టైలర్స్ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో టైలర్ల కష్టాలను స్వయంగా చూసి అధికారంలోకి రాగానే సీఎం జగన్ జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.10 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. దర్జీ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న ప్రతి పేద దర్జీకి ఇది ఒక ఆసరాగా ఉపయోగపడుతోందన్నారు. రెడీమేడ్ వస్త్రాలకు గిరాకీ పెరుగుతున్న తరుణంలో టైలరింగ్ వృత్తిని కొనసాగించాలనే భావన ప్రతి ఒక్కరిలో వస్తోందన్నారు. టైలరింగ్ ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. టైలర్ల సంఘం యలమంచిలి మండలాధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు దర్జీలను పట్టించుకోలేదని, టైలరింగ్ వృత్తిని కొనసాగించలేక కుటుంబ పోషణ గడవక వివిధ పరిశ్రమల్లో ఉపాధికి వెళ్లేవారని వాపోయారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడుతోపాటు ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరారు. ఈ నెల 28 టైలర్స్ డే సందర్భంగా యలమంచిలి పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు, దర్జీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మళ్ల శ్రీనివాస్, పిళ్లా శివ, డి.సూరిబాబు, శెట్టి శ్రీను, రైవాడ శంకరరావు, వద్దిపర్తి సత్తిబాబు, వేగి విజయ, గిడుతూరి అప్పారావు, గొట్టేడ గణపతి, కట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.